# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV
www.MHRtv.com

మెదక్ | సంపుటి: 18 సంచిక: 47 | ఆదివారం, 03 నవంబర్ 2024 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamada-Vijayawada-Guntur-Vizag Adilabad Kurnool | www.prajaswaramdaily.com


# సీఎం మార్పు ఉండదు

ఏలేటికి అవగాహన లేదు.. ఆ ఆరోపణలన్నీ ఫేక్

రాష్ట్రంలో సీఎం ఉండగా కొత్త సీఎం ప్రస్తావన ఎక్కడిది?

బీజేపీ ఆఫీస్‌లో ఆయనకు కనీసం కూర్చీనే లేదు

పార్టీ చీఫ్ కిషన్ రెడ్డికి మహేశ్వర్ రెడ్డికి పడ్తలేదు

టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. దేశంలో ఎవరు ఎంత జనాభా ఉంటే అంతే ఫలాలు అందాలని రాహుల్ గాంధీ భావించారని చెప్పారు. కుల గణన పై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోందని తెలిపారు. కుల గణనపై కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులతో రాహుల్ గాంధీ

మిగతా 2లో..

# డీల్ కుదిరిందా?

## సల్కం చెరువులో ఫాతిమా కాలేజీని టచ్ చేయని హైడ్రా


ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు అసదుద్దీన్ ఒవైసీ మద్దతు

ఇన్నాళ్లు కలిసి ఉన్న.. బీఆర్ఎస్ పార్టీపై మండిపాటు

గులాబీ పార్టీ జాతకాలు తన వద్ద ఉన్నాయని కామెంట్

బయటకు చెబితే తట్టుకోలేరని మండిపాటు





**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

మొన్నటివరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి మిత్ర పక్షంగా ఉన్న ఎంఐఎం.. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మిత్రపక్షంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వానికి మిత్రపక్షంగా ఉన్నప్పటికీ.. ఇన్ని రోజులు బీఆర్ఎస్ పార్టీ మీద ఎలాంటి విమర్శలు చేయని ఎంఐఎం నేతలు.. ఇప్పుడు మెల్లగా అది కూడా మొదలుపెట్టారు. బీఆర్ఎస్ పార్టీపై ఏకంగా ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సంచలన వ్యాఖ్యలు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తాజాగా అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ జాతకాలన్నీ తమ దగ్గరున్నాయని.. అవన్నీ చేప్తే వాళ్లు తట్టుకోలేరంటూ కీలక కామెంట్లు చేశారు. ''మూసీ ప్రక్షాళన కోసం బీఆర్ఎస్ ప్రణాళికలు చేయలేదా? ఆ ప్రణాళిక వద్దని నేను చెప్పలేదా'' అంటూ అసదుద్దీన్ ప్రశ్నించారు. ''అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా'' అని అడిగిన అసదుద్దీన్.. తాను నోరు విప్పితే బీఆర్ఎస్ నేతలు ఇబ్బంది పడతారంటూ హెచ్చరించారు. ఇళ్లు కదల్చకుండా మూసీ ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తామని అసదుద్దీన్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ విధానాలు స్థిరంగా ఉండాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీకి జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ వల్లే ఎక్కువ సీట్లు వచ్చాయని

మిగతా 2లో..

**"బీఆర్ఎస్ జాతకాలు మా దగ్గర ఉన్నాయి. అవి చెబితే వాళ్లు తట్టుకోలేరు. ఆ విషయాలన్నీ నేను ఇప్పుడు బయటపెట్టాలా ? . నేను నోరు విప్పితే బీఆర్ఎస్ నేతలు ఇబ్బంది పడతారు"**
**- అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధినేత**

# మెట్రో సెకండ్ ఫేజ్ పనులకు గ్రీన్ సిగ్నల్

- నిర్మాణ పనులకు పరిపాలన అనుమతులు జారీ
- రెండో దశలో 76. 4 కి.మీ మేర.. ఐదు మార్గాల్లో నిర్మాణాలు
- రూ. 29 వేల 269 కోట్ల వ్యయం
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనులు
- రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 7వేల 313 కోట్లు.. కేంద్రం వాటా 4వేల 230 కోట్లు

2



# మా దగ్గర బీఆర్ఎస్ జాతకాలు

- నోరు విప్పితే ప్రాబ్లమ్స్‌లో పడ్తరు
- అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా?
- 24 మందిని మార్చి ఉంటే బీఆర్ఎస్ గెలిచేది
- జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు మా సపోర్టే
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

2

# జనవరిలో సర్పంచ్ ఎన్నికలు

- రేషన్ కార్డుల స్థానాల్లో స్మార్ట్ కార్డులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తాం
- నాలుగు విడతల్లో రూ.5 లక్షల పేమెంట్ చేస్తాం
- రాష్ట్రంలో సీఎం మార్పు ఉండదు.. ఫుల్ టైం రేవంతే ఉంటారు
- ప్రతిపక్షాల ఆరోపణలు టీ కప్పులో తుఫాన్ లాంటివి
- మీడియాతో మంత్రి పొంగులేటి కామెంట్స్



2



2

# నేడే బీసీ గర్జన

- మిర్యాలగూడలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సభ
- బీసీలకు రాజ్యాధికారం రావడమే లక్ష్యం
- హాజరుకానున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తదితరులు

# మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

మీ ప్రకటనలో అపోహలు.. అవాస్తవాలు

ఏ బీజేపీ పాలిత రాష్ట్రంతో పోల్చినా తెలంగాణదే రికార్డు

ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నం

10 నెలల్లో 50 జాబ్స్ ఇచ్చినం..

22,22 మందికి రుణమాఫీ చేసినం

ప్రధాని మోదీ వ్యాఖ్యలకు సీఎం రేవంత్ కౌంటర్

యూనివర్సిటీల్లో నూరు శాతం ప్రక్షాళన

దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలి

నూతన వీసీలకు సీఎం దిశానిర్దేశం

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

కాంగ్రెస్ అధికారంలో ఉన్న హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, రాష్ట్రాల్లోని ఆర్థిక పరిస్థితిపై ప్రధాన మంత్రి మోదీ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ఆయా రాష్ట్రాల్లో అభివృద్ధి,ఆర్థిక స్థితి రోజురోజుకూ దిగజారుతోందంటూ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చారు. రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు స్కీమ్, విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపుతో పలు అంశాలను మోదీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి

మిగతా 2లో..

# రాష్ట్రంలో ఓటర్లు 3,34,26,323



**పురుషులు : 1,66,16,446**

**మహిళలు : 1,68,07,100**

**డ్రాఫ్ట్ జాబితా విడుదల చేసిన సీఈవో సుదర్శన్ రెడ్డి**

**ఫైనల్ లిస్ట్ జనవరి 6 ప్రకటిస్తామని వెల్లడి**

**ఇప్పటి వరకు 4. 14 లక్షల బోగస్ ఓట్లు తొలగించినట్లు స్పష్టం**

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

ప్రస్తుతం తెలంగాణలో 3,34,26,323 మంది ఓటర్లు ఉన్నారని ఎన్నికల సంఘం సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా నాలుగు లక్షల ఓట్లను తొలగించామన్నారు. 8 లక్షల మంది కొత్తగా ఓటర్లుగా నమోదు అయ్యారని వెల్లడించారు. రాష్ట్రంలో 3.34 కోట్ల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటర్ల తుది జాబితాను జనవరి 6 ప్రకటిస్తామని ఆయన తెలిపారు. శనివారం బీఆర్ కే ఆర్ భవన్ లో మీడియా సమావేశంలో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ గత నెల 29న ఓటర్ల డ్రాఫ్ట్ జాబితాను ప్రకటించామని, ప్రస్తుతం తెలంగాణలో

మిగతా 2లో..



# రాష్ట్ర పండుగగా సదర్

- జీవో జారీ చేసిన సర్కార్
- ఈ వేడుకల నిర్వహణ బాధ్యతలను పర్యాటక, సాంస్కృతిక శాఖలకు అప్పగింత

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో యాదవ సోదరులు ఎంతో ఘనంగా నిర్వహించే సదర్ వేడుకలను రాష్ట్ర

మిగతా 2లో..


# రేవంత్.. ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ చూపించు

- ఆఫర్ లేటర్లు ఇచ్చి జాబ్స్ ఇచ్చామంటే ఎట్లా?
- 50 వేల ఉద్యోగాలపై కాంగ్రెస్ ప్రచారం సిగ్గుచేటు
- ఇంతా ఫేక్ ప్రచారం చేయడం దురదృష్టకరం
- సర్కార్‌పై మాజీ మంత్రి హరీశ్ రావు ఫైర్
- రాష్ట్రంలో రుణమాఫీ సగం మందికైనా చేశారా?
- హామీల అమలుకు 100 రోజులని.. 300 రోజులు గడిచినా దిక్కులేదు
- తులం బంగారం ఊసేలేదు.. విద్యా భరోసా కార్డు ప్రారంభం కాలేదని ట్వీట్

**ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో:**

హామీల అమలులో రాష్ట్ర ప్రజలతో పాటు దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీఆర్ఎస్ గత తొమ్మిదేళ్లలో 1,16,000 పోస్టులు భర్తీ చేసిందన్నారు. నియామకాలపై దుష్ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 50 వేల ఉద్యోగాలు ఇచ్చామంటూ

మిగతా 2లో..





# కాంగ్రెస్‌కు 100 కాదు.. పది వేల రోజులైనా సరిపోవు

- ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు మోసం
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు
- ప్రతి వ్యక్తి తలపై రూ.2.5 లక్షల అప్పు ఉంది
- కేంద్రమంత్రి బండి సంజయ్

# కాంగ్రెస్‌కు 100 కాదు.. పది వేల రోజులైనా సరిపోవు

- ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు మోసం
- రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేశారు
- ప్రతి వ్యక్తి తలపై రూ.2.5 లక్షల అప్పు ఉంది
- కేంద్రమంత్రి బండి సంజయ్

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు పది వేల రోజులు కూడా సరిపోవని, అబద్ధపు హామీలతో తెలంగాణ ప్రజలను మోసం చేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై ప్రధాని మోడీ చేసిన విమర్శలకు ట్విట్టర్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ అంశంపై స్పందించిన బండి సంజయ్ తనదైన శైలిలో సీఎం రేవంత్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు. మీ గ్యారంటీలకు షరతులు వర్తిస్తాయని తెలంగాణ అమాయక ప్రజలకు తెలియదని, ఆరు హామీలు నెరవేర్చడానికి వంద రోజులు కాదని, పదివేల రోజులు కూడా సరిపోవని ఎద్దేవా చేశారు. ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయని, కేసీఆర్ కొత్తగా పుట్టిన బిడ్డపై రూ.1 లక్ష అప్పు వేసినట్లే మీరు కూడా ప్రతి తెలంగాణ వ్యక్తి తలపై రూ.2.5 లక్షల అప్పులు చేస్తారని ఆరోపించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని, రైతు భరోసా, రూ.500 బోనస్ బోగస్ అయ్యిందని విమర్శలు చేశారు. రూ.500 గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌లో అర్హులైన లబ్ధిదారులు మిగిలిపోయారనిఅన్నారు. మూసీ ప్రాజెక్ట్ కోసం మీ వద్ద రూ.1.5 లక్షల కోట్లు ఉన్నాయి గానీ, ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి డబ్బు లేవని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం తరహాలో మరో ఏటీఎంగా మూసీ రూపు దిద్దుకోనుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని ఆవాస్ యోజన కింద మేం ఇళ్లు నిర్మిస్తుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూలుస్తోందని అన్నారు. హాస్టళ్లలో నాసిరకం ఆహారంపై విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థులు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కోసం విద్యార్థులు నిరసనలు ప్రారంభించారని తెలిపారు.

# డీల్ కుదిరిందా?

(మొదటి పేజీ తరువాయి)

అసదుద్దీన్ చెప్పుకొచ్చారు. ఎంఐఎం మద్దతుతోనే ఎక్కువ సీట్లు వచ్చాయని గుర్తుచేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లోనూ.. 24 మంది అభ్యర్థులను మార్చి ఉంటే బీఆర్ఎస్ మళ్లీ గెలిచేదని తెలిపారు. అప్పట్లో బీఆర్ఎస్ పార్టీ నేతలకు చాలా అహంకారం ఉండేదంటూ కీలక వ్యాఖ్యలు చేశారు.

**హైడ్రాపై అప్పుడలా.. మూసీపై ఇప్పుడిలా..**

సల్కం చెరువులో ఉన్న ఒవైసీకి చెందిన ఫాతిమా కాలేజీని కూల్చివేయాలన్న డిమాండ్లు తెరమీదకు వచ్చినప్పుడు అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా స్పందించారు. నగరంలోని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ప్రభుత్వ భవనాలను కూడా కూల్చివేస్తారా అంటూ ప్రశ్నించారు. హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిలో బల్దియా భవనాన్ని నిర్మించారని, దాన్ని కూడా కూల్చివేస్తారా అని నిలదీశారు. నెక్లెస్ రోడ్ కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వస్తుందని దాన్ని కూల్చివేస్తారా అంటూ ప్రశ్నించారు. హైకోర్టు కూడా బఫర్ జోన్ లో ఉందని దాన్ని కూడా కూల్చివేస్తారా? అని కామెంట్ చేశారు. అయితే పేదల ఇండ్లను నేలమట్టం చేసిన హైడ్రా.. ఒవైసీ సోదరులకు భయపడే సల్కం చెరువులో ఉన్న ఫాతిమా కాలేజీని కూల్చలేదని ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీనాయకులు ఆరోపించారు. దానికి బదులుగానే.. ఒవైసీ సోదరులు ఇప్పుడు మూసీ ప్రక్షాళనకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నట్లు చర్చ జరగుతోంది. పాతబస్తీని ఆనుకొని ప్రవహించే మూసీ నదిని ప్రక్షాళన చేయడం.. ఒవైసీల మద్దతు లేకుండా కుదరదు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి హైడ్రా అనే అస్త్రంతో ఫాతిమా కాలేజీని చూపి.. మూసీ ప్రక్షాళనకు ఒవైసీల నుంచి గ్రీన్ సిగ్నల్ ఇప్పించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

**బాధితులు ఏమంటారు?**

మూసీ ప్రక్షాళనలో భాగంగా నిర్వాసితులుగా మారే వారిలో మెజార్టీ జనం.. నిరుపేద ముస్లింలే. వీరంతా మూసీ ఒడ్డున ఉన్న తమ ఇండ్లను వదిలి ప్రభుత్వం ఇస్తానంటున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి వెళ్లేందుకు సిద్ధంగా లేరు. ఒక రకంగా మూసీ ప్రక్షాళననే వారంతా వ్యతిరేకిస్తున్నారు. ఇప్పుడు ఎవరూ కదిలించకుండానే.. ఒవైసీ తానంతట తానే బయటకు వచ్చి మరీ.. మూసీ ప్రక్షాళనకు మద్దతు తెలపడం.. మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ పార్టీని విమర్శించడాన్ని పేద ముస్లింలు ఎలా అర్థం చేసుకుంటారనేదానిపై ఉత్కంఠ నెలకొంది.

# మా దగ్గర బీఆర్ఎస్ జాతకాలు

- నోరు విప్పితే ప్రాబ్లమ్స్‌లో పడ్తరు
- అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా?
- 24 మందిని మార్చి ఉంటే బీఆర్ఎస్ గెలిచేది
- జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు మా సపోర్టే
- ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ


ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

తాను నోరు విప్పితే బీఆర్ఎస్ వాళ్లు ఇబ్బంది పడతారని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కామెంట్స్ చేశారు. గులాబీ పార్టీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మూసీ ప్రక్షాళన కోసం బీఆర్ఎస్ ప్రణాళికలు చేయలేదా? ఆ ప్రణాళిక వద్దని నేను చెప్పలేదా? అప్పటి విషయాలన్నీ ఇప్పుడు బయటపెట్టాలా? నేను నోరు విప్పితే ఆ పార్టీ వాళ్లు ఇబ్బంది పడతారు. ఇళ్లు కదల్చకుండా మూసీ ప్రక్షాళన చేస్తే స్వాగతిస్తాం. బీఆర్ఎస్ విధానాలు స్థిరంగా ఉండాలి. ఆ పార్టీకి జీహెచ్ఎంసీలో ఎక్కువ సీట్లు మా చలవే. ఎంఐఎం మద్దతుతోనే ఎక్కువ సీట్లు వచ్చాయి. 24 మందిని మార్చి ఉంటే గులాబీ పార్టీ మళ్లీ గెలిచేది. అప్పట్లో ఆ పార్టీ నేతలకు అహంకారం ఉండేది. ఎక్కువ మంది సంతానం ఉండాలని చంద్రబాబు, స్టాలిన్ అంటున్నారు. అదే విషయాన్ని నేను చెప్పి ఉంటే రాద్ధాంతం చేసేవారు. దక్షిణ భారత్‌లో జననాల రేటు తక్కువగా ఉందని చంద్రబాబు గుర్తించారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాదికి నష్టం. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల సంఖ్య తగ్గుతుంది. బాగా పనిచేసిన రాష్ట్రాలను ప్రోత్సహించకుండా శిక్షిస్తే ఏం లాభం?' అని అసదుద్దీన్ నిలదీశారు.

# రాష్ట్రంలో ఓటర్లు 3,34,26,323

(మొదటి పేజీ తరువాయి)

3,34,26,323 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. యువ ఓటర్లు 4,73,838 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. తెలంగాణలో 551 పోలింగ్ కేంద్రాలు పెరిగాయని, ప్రస్తుతం తెలంగాణలో 35,907 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ప్రకటించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలను ఈనెల 28 వరకు స్వీకరిస్తామని, జనవరి 6న ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు లేదని స్పష్టం చేశారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఓటరు జాబితా ప్రక్షాళనలో భాగంగా అత్యధిక ఓట్లను హైదరాబాద్ జిల్లాలో తొలగించారు. ఈ జిల్లాలో 1,29,880 ఓట్లను తొలగించారు. ఇందులో 7730 మంది చనిపోయారని,



22677 ఓటర్లు రెండు అంత కంటే ఎక్కువ సార్లు ఓటర్లుగా ఉన్నారని, మరో 99,379 మంది షిఫ్ట్ అయ్యారని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఆ తరువాత రంగారెడ్డి జిల్లాలో 58,120, మేడ్చల్ లో 34680, కరీంనగర్ జిల్లాలో 21,463, నల్గొండ జిల్లాలో 12,956 ఓట్లను తొలగించారు. కొత్త ఓట్ల నమోదులోనూ హైదరాబాద్ జిల్లా ముందుంది. ఈ జిల్లాలో 1.81లక్షల మంది ఓటర్లు కొత్తగా నమోదు అయ్యారు. రంగా రెడ్డి జిల్లాలో 1.18 లక్షల మంది, మేడ్చల్ జిల్లాలో 99696 కొత్త ఓటర్లుగా నమోదు అయ్యారు.

# జనవరిలో సర్పంచ్ ఎన్నికలు

- రేషన్ కార్డుల స్థానాల్లో స్మార్ట్ కార్డులు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తాం
- నాలుగు విడతల్లో రూ. 5 లక్షల పేమెంట్ చేస్తాం
- రాష్ట్రంలో సీఎం మార్పు ఉండదు.. ఫుల్ టైం రేవంతే ఉంటారు
- ప్రతిపక్షాల ఆరోపణలు టీ కప్పులో తుఫాన్ లాంటివి
- మీడియా చిట్ చాట్‌లో మంత్రి పొంగులేటి కామెంట్స్

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

తెలంగాణ సీఎం మార్పు ఉండదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి పీరియడ్ ఇంకా నాలుగేండ్ల ఒక నెల ఉందని, పూర్తి కాలం రేవంత్ రెడ్డినే సీఎంగా ఉంటారని తెలిపారు. ప్రతిపక్షాలు ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆయన మాట్లాడుతూ..ఏమైనా చిన్న చిన్నవి ఉంటే అవి టీ కప్పులో తుఫాను మాత్రమే అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తామన్నారు. గ్రామ సభలు పెట్టి ఇండ్లను మంజూరు చేస్తామని, నాలుగు విడతల్లో 5 లక్షలు పేమెంట్ చేస్తామన్నారు. ఫౌండేషన్ లెవల్‌కు లక్ష, లెంటల్ లెవల్‌కు 1.25 లక్షలు, స్లాబ్ లెవల్‌కు 1.75 లక్షలు, పూర్తి అయ్యాక లక్ష చెల్లిస్తామన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం ఉంటుందన్నారు. సొంత స్థలంలో ఇండ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసి నిర్మాణం మొదలు పెట్టిన ఇండ్లకు కూడా సహాయం చేస్తామన్నారు. ఈ నెల 20 లోపు ఇందిరమ్మ కమిటీలు లబ్ధిదారుల జాబితాను పంపిస్తాయన్నారు.



**కేంద్రం లోగో పెట్టుకోవడానికి కూడా ఒప్పుకున్నాం..**

ఈ నెలాఖరుకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి అవుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఆ వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఫ్రీ ఇసుక ఇచ్చే అవకాశాలు పరిశీలిస్తామన్నారు. కేంద్ర గృహ నిర్మాణ స్కీం అడాప్ట్ చేసుకుంటున్నామని, పేద ప్రజలకు అన్యాయం జరగొద్దని కేంద్రం ఎన్ని కండిషన్లు పెట్టినా ఒప్పుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేంద్రం లోగో పెట్టుకోవడానికి కూడా ఒప్పుకున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలకు కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. రాబోయే నాలుగేళ్లు 20 లక్షల ఇండ్ల నిర్మాణం టార్గెట్ పెట్టుకున్నామని.. తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి విడత ఇండ్లకు 26 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. సంక్రాంతి పండుగ ముందు సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# మెట్రో సెకండ్ ఫేజ్

- పనులకు గ్రీన్ సిగ్నల్
- నిర్మాణ పనులకు పరిపాలన అనుమతులు జారీ
- రెండో దశలో 76. 4 కి.మీ మేర.. ఐదు మార్గాల్లో నిర్మాణాలు
- రూ. 29 వేల 269 కోట్ల వ్యయం
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పనులు
- రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 7వేల 313 కోట్లు.. కేంద్రం వాటా 4వేల 230 కోట్లు

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనులకు రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది. రెండో దశ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులను జారీ చేసింది. ఈ రెండో దశలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు నిర్మాణ పనులకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ప్రభుత్వం జీవోను జారీ చేసింది. మెట్రో రెండో దశకు అంచనా వ్యయం రూ. 24,269 కోట్లు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ. 7,313 కోట్లు. హైదరాబాద్ మెట్రో మొదటి దశలో మూడు కారిడార్లలో కలుపుకుని మొత్తం 69 కిలోమీటర్ల మేర నిర్మాణం జరిగింది. మొదటి దశ ప్రాజెక్టుకు రూ. 22 వేల కోట్లు ఖర్చైంది. హైదరాబాద్ మెట్రో ద్వారా ప్రస్తుతం రోజుకు దాదాపు 5 లక్షల మంది ప్రయాణం చేస్తున్నారు. రెండో దశ కూడా అందుబాటులోకి వస్తే రోజుకు మరో 8 లక్షల మంది మెట్రోలో ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. రెండో దశ నిర్మాణ పనులు ఐదు కారిడార్లలో మొత్తం 76.4 కిలో మీటర్ల మేర జరగనున్నాయి.

**సిటీలో ట్రాఫిక్ కష్టాలకు చెక్..**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెండో దశ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా 30 శాతం (రూ.7,313కోట్లు), కేంద్ర వాటా 18 శాతం (రూ.4,230 కోట్లు) కేటాయింపులు చేసింది. జైకా, ఏబీడీ, ఎన్డీబీ నిధులు 48శాతం (రూ. 11,693 కోట్లు), పీపీపీ పద్ధతిలో 4శాతం (రూ. 1,033 కోట్లు) సేకరించనున్నారు. హైదరాబాద్‌కు సిటీ చుట్టు పక్కల నుంచి భారీగా రోజు వారీ కార్మికులు, ఉద్యోగాలు వస్తుంటారు. వారు నేరుగా గమ్య స్థానాలకు చేరుకునే వెసులుబాటు లేకపోవడంతో.. ఆటోలు, బస్సులో మెట్రో స్టేషన్ వరకు రావడం అక్కడి నుంచి మెట్రోలో ప్రయాణించాల్సి వచ్చేంది. మెట్రో దిగిన తర్వాత.. మళ్లీ ఆటోలు, బస్సుల్లో గమ్య స్థానాలకు వెళ్లాల్సిన పరిస్థితి. నగరంలో అవసరమైన అన్ని మార్గాల్లో నూతన మెట్రోను పరుగులు తీయించాలని భావించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. ఐదు నూతన కారిడార్ల డీపీఆర్ లను సిద్ధం చేసి పరిపాలన అనుమతులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**ఐదు కారిడార్లు ఇలా..**

- కారిడార్ -4లో
- నాగోల్ – శంషాబాద్ (36.8 కిలో మీటర్లు)
- కారిడార్ -5లో
- రాయదుర్గం – కోకాపేట నియోపోలీస్ వరకు (11.6 కిలో మీటర్లు)
- కారిడార్ -6లో
- ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు (7.5 కిలో మీటర్లు)
- కారిడార్ -7లో
- మియాపూర్ నుంచి పటాన్ చెరు వరకు (13.4 కిలో మీటర్లు)
- కారిడార్ -8లో
- ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు (7.1 కిలో మీటర్లు)
- రెండో దశలో పార్ట్ -బీ
- కారిడార్ -9లో
- శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీ (స్కిల్ యూనిర్సిటీ) వరకు (40 కిమీ.)

# రేవంత్.. ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ చూపించు

(మొదటి పేజీ తరువాయి)

డబ్బా కొట్టుకుంటున్నారని, ఈ ఉద్యోగాలు గత ప్రభుత్వంలోనే నోటిఫై చేసి పరీక్షలు నిర్వహించామన్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి పూర్తి చేసినవేనన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా పెండింగ్‌లో ఉన్న నియామకపత్రాలు ఇచ్చి తాము ఇచ్చినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి హామీ ఇచ్చారని, ఈ రోజుకు పది శాతం కూడా పూర్తి చేయలేదని మండిపడ్డారు. 2023 డిసెంబర్ 9 నాటికి రుణమాఫీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా అర్హులైన రైతుల్లో సగానికిపైగా ఇంకా వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని విమర్శించారు. ప్రతి విద్యార్థికి రూ.5లక్షలతో విద్యా భరోసా కార్డు ఇస్తామన్న హామీ ఇంకా ప్రారంభం కాలేదని గుర్తుచేశారు. ప్రతి పంటకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి సన్న రకాలకు మాత్రమే పరిమితం చేశారన్నారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం హామీ ఊసేలేదని, మహిళా విద్యార్థులకు ఎలక్ట్రికల్ వాహనాల హామీ గుర్తు కూడా లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలు నెరవేర్చుతామని చెప్పారని, 300 రోజులు గడిచినా హామీలను నెరవేర్చలేదన్నారు.

**రేవంత్ రెడ్డి పాలన పట్టాలు తప్పింది..**

బెటాలియన్ పోలీస్ కానిస్టేబుళ్లు, వారి కుటుంబసభ్యుల నిరసన సెగలు చల్లారకముందే ఇప్పుడు హోంగార్డుల భార్యలు ఆందోళనలకు దిగారు. తమ సమస్యలను పరిష్కారం కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద వద్ద నిరసన దీక్ష చేపట్టారు. హోంగార్డుల ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని..జీతాలను సరైన సమయానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో అప్రమత్తమైన పోలీసులు హోంగార్డుల భార్యలను అరెస్టు చేసి తరలించారు. ఈ క్రమంలో ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న టీజీఎస్పీ పోలీసుల భార్యలు రోడ్డెక్కితే, నేడు హోంగార్డుల భార్యలు రోడ్డెక్కారని హరీశ్‌రావు అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నరని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా పోలీసుల ఆందోళనలతో పాటు శాంతి భద్రతలు అడుగంటిన దృశ్యాలే కనిపిస్తున్నాయని అన్నారు. హోం మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన పట్టాలు తప్పిందనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు.

# మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

(మొదటి పేజీ తరువాయి)


ట్వీట్ చేశారు. ప్రియమైన మోదీజీ మీరు తెలంగాణ ప్రభుత్వం గురించి చేసిన ప్రకటనలో అనేక అవాస్తవాలు ఉన్నాయని చెప్పారు. మీరు లేవెనత్తిన అపోహాలపై క్లారిటీ ఇస్తున్నట్లు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. డిసెంబర్ 7, 2023 నుంచి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ దుష్ట పాలన పోయిన తర్వాత... రాష్ట్రంలోని ప్రజల్లో ఆశలు చిగురించాయని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే టీజీఎస్ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం స్కీమ్‌ను అమలు చేసిందని గుర్తు చేశారు.

**ఏడాది కూడా పూర్తికాకముందే..**

రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల ఆరోగ్య బీమాను కూడా ఇస్తోందని పేర్కొన్నారు. గడిచిన 11 నెలల్లో తెలంగాణలో మహిళలు రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారని రేవంత్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వానికి ఏడాది కూడా పూర్తి కాకముందే...రైతుకు భరోసానిచ్చేలా రుణమాఫీని అమలు చేశామన్నారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. 22 లక్షల 22 వేల మంది రైతుల రుణాలను మాఫీ చేశామని చెప్పారు. కేవలం 25 రోజుల్లోనే 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తు చేశారు. ఇళ్లకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఛార్జీ లేకుండా ఉచిత విద్యుత్ ను కూడా ఇస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉంటే.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కేవలం రూ. 500కే సిలిండర్ లభిస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు.

**రాజకీయ ఒత్తిళ్లతో వీసీలను నియమించలేదు..**

రాష్ట్రంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఉన్నత



విద్యా మండలి చైర్మన్ తో పాటు అన్ని యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు సీఎం రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణలో యూనివర్సిటీలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని, ఉన్నత విద్యకు సంబంధించి గడిచిన పదేండ్లలో దెబ్బతిన్న వ్యవస్థలను తిరిగి పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి అన్నారు. రాజకీయ ఒత్తిళ్ల ప్రభావంతో వీసీలను నియమించలేదని, ప్రతిభ, సామాజిక సమీకరణలనే పరిగణనలోకి తీసుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు.

# సీఎం మార్పు ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం అవుతారని తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 5 వ తేదిన బోయిన్ పల్లి ఐడియాలజీ సెంటర్ లో సాయంత్రం 4 గంటలకు రాహుల్ గాంధీ కుల, విద్యార్థి సంఘాల నాయకుల సమావేశం అవుతారని వెల్లడించారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సర్వేలో పాల్గొనాలని టీపీసీసీ చీఫ్ కోరారు.

**కాంగ్రెస్ విషయాలు ఎలా తెలుస్తయి..?**

బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డికి ఆ పార్టీలో కుర్చీనే లేదని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటొందన్నారు. ప్రస్తుతం సీఎం ఉండగా కొత్త సీఎం అనే ప్రస్తావన ఎందుకు వస్తుందన్నారు. అసలు మహేశ్వర్ రెడ్డికి కాంగ్రెస్ విషయాలు ఎలా తెలుస్తాయన్నారు. ఈ నెల 6 లేదా 7 వ తేదిన కుల గణనపై అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల హామీలపై మాట్లాడిన విషయాలను కొందరు వక్రీకరిస్తున్నారని అన్నారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకానికి అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

# నేడే బీసీ గర్జన

- మిర్యాలగూడలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో సభ
- బీసీలకు రాజ్యాధికారం రావడమే లక్ష్యం
- హాజరుకానున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య తదితరులు

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

రాజ్యాధికారమే లక్ష్యంగా మిర్యాలగూడలో నేడు బీసీ గర్జన జరగనున్నది. బీసీ రాజకీయ చైతన్య వేదిక, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మిర్యాలగూడలో బీసీ గర్జన సభ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఎన్ఎస్ఆర్ క్యాంప్ గ్రౌండ్ (పూలే వేదిక) లో జరగనున్నది. ఈ సమావేశానికి శాసన మండలి సభ్యులు తీన్మార్ మల్లన్న, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, నేతి విద్యాసాగర్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు, మేకపోతుల నరేందర్ గౌడ్ తదితరులు ముఖ్య నాయకులు హాజరుకానున్నారు. బీసీలను వెనకకు నెట్టబడడం ఎలా జరిగింది? నెట్టిన వాళ్ళని వెనకకు తోసేయడానికి రంగం సిద్ధం అవుతుందని చెప్పడానికి దిశా నిర్దేశం, బీసీల బతుకులు మార్చడానికి జరిగే ఈ మహాసభకు తప్పనిసరిగా హాజరు కావలసిందిగా బీసీ నేతలు కోరారు.

## తెలంగాణ రాష్ట్ర పండుగగా సదర్



(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం గుర్తించింది. సదర్ సమ్మేళనానికి రాష్ట్ర పండగ హోదా కల్పిస్తూ తెలంగాణ ప్రభుత్వం తాజాగా జీవో జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జీవో నంబర్ 1459ను విడుదల చేశారు. రాజ్యసభ సభ్యుడు అనికుమార్ యాదవ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఎస్ పేర్కొన్నారు. పర్యాటక, సాంస్కృతిక శాఖలు.. సదర్ నిర్వహణకు సంబంధించిన బాధ్యతలు తీసుకోవాలని సర్కార్ సూచించింది. ఈ శాఖలకు బడ్జెట్ కూడా కేటాయించనున్నట్లు సీఎస్ తెలిపారు. కాగా, హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో ఈ సదర్ సమ్మేళనాన్ని యాదవ సోదరులు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. తెలంగాణలోని ఇతర జిల్లాల్లో కూడా సదర్ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇక నుంచి రాష్ట్ర పండుగగా ప్రభుత్వం సదర్ వేడుకలు నిర్వహించనుంది. ఈ సదర్ వేడుకలకు దాదాపు 70 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. సికింద్రాబాద్, హైదరాబాద్ జంట నగరాలతో సదర్ సమ్మేళన నిర్వహణ చాలా ఫేమస్. దీపావళి పండుగ సమయంలో యాదవులు సదర్ పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. నగరంలోని ముషీరాబాద్లో అతిపెద్ద సదర్ సమ్మేళనం నిర్వహిస్తారు. దీపావళి తరువాత రెండో రోజు దున్నపోతులతో నిర్వహించే సదర్ వేడుకలకు పెద్ద ఎత్తున జనం హాజరవుతుంటారు. యాదవులు దున్నపోతులను ప్రదర్శించి వేడుక చేస్తారు. నగరంలోని ఖైరతాబాద్, సైదాబాద్, కాచిగూడ, నారాయణగూడ, బోయిన్‌పల్లి, ఈస్ట్‌మారెడ్‌పల్లి, కార్వాన్, పాతబస్తీ చప్పల్ బజార్, మధురాపూర్, ముషీరాబాద్ ప్రాంతాల్లో ఈ ఉత్సవాలు జరుగుతాయి. గతంలో తెలంగాణలోని జిల్లాల నుంచి దున్నలను హైదరాబాద్ తీసుకొచ్చి సదరన్ వేడుకల్లో పోటీల్లో నిలిపేవారు. గత 10, 15 ఏళ్ల కిందట నుంచి పంజాబ్, హర్యానా లాంటి రాష్ట్రాల నుంచి సైతం భారీ దున్నపోతులను హైదరాబాద్ తీసుకొచ్చి ప్రదర్శిస్తున్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

- బైక్ ట్రాక్టర్ ఢీకొని నలుగురు మృతి
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారంలో ఘటన






**తూప్రాన్, మనోహరాబాద్, నవంబర్ 02 (ప్రజాస్వరం) :**

బైకు ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం పోతారంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం మెదక్ జిల్లా మనోహరబాద్ మండలం పరిధిలోని పోతారం గ్రామానికి చెందిన మన్నే ఆంజనేయులు (40), తన మరదలు లావణ్య (35) , లావణ్య పిల్లలు శాన్వి(11), సహస్ర(8),లు శనివారం సాయంత్రం లావణ్య తన ఇద్దరు పిల్లలతో వర్గల్ మండలంలోని మజీద్ పల్లి గ్రామంలో తన బంధువుల ఇంటి వద్దకు ఫంక్షన్ కోసం బయలుదేరారు. పోతారం నుండి రవాణా సదుపాయం సరిగ్గా లేకపోవడం తన బావ ఆంజనేయులుతో కలిసి వెళ్తుండగా గ్రామ శివారు దాటగానే వారికి ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరు ప్రయాణిస్తున్న బైక్ను బలంగా ఢీకొట్టింది. ముందు బైక్ నడుపుతున్న మన్నే ఆంజనేయులు బైక్ ను బలంగా ఢీకొట్టడంతో తన తల మొండెం నుంచి వేరై అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఆంజనేయులు వెనకాల కూర్చున్న తన మరదలు లావణ్య కూతుర్లు ఇద్దరు శాన్వి సహస్ర తలలకు తీవ్రంగా దెబ్బ తగలడంతో వారందరూ స్పాట్ లోనే చనిపోయారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందడంతో పోతారం గ్రామంలో విశాధఛాయలు అలుముకున్నాయి. ఎదురుగా వచ్చి బైక్ను ఢీ కొట్టిన ట్రాక్టర్ డ్రైవర్ను కఠినంగా శిక్షించాలని పోతారం గ్రామస్తులు రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బందోబస్తు నడుమ మృతుల బాడీలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




# ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్

**మెదక్, నవంబర్ 02 (ప్రజా స్వరం) :**

బీజేపీ మెదక్ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం మెదక్ జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ నగేష్‌కి వరి కొనుగోలు సెంటర్‌ను త్వరితగతిన ఏర్పాటు చేయాలని, తడిసిన వడ్లను కొనుగోలు చేయాలని బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశంలోని రైతులు ఆదాయాన్ని రెట్టింపు చేయాలని మద్దతు ధర ప్రతి సంవత్సరం పెంచడం జరుగుతుందన్నారు. కొనుగోలు సెంటర్ల కు సంబంధించి పూర్తి డబ్బును అదే విధంగా దానికి సంబంధించిన వసతులు కేంద్ర ప్రభుత్వం సమకూర్చినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఇంత వరకు ఏ ఒక్క సెంటర్‌లో కూడా ఒక్క కిలో వడ్ల గింజలు కూడా కొనుగోలు చేయలేదన్నారు. రైస్ మిల్లర్‌తో రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై ఇంతవరకు ఏ ఒక్క కొనుగోలు సెంటర్లు నామమాత్రంగా ఏర్పాటు కానీ ఇంతవరకు ఒక్క గింజ కూడా ధాన్యం కొనుగోలు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు బైండ్ల సత్యనారాయణ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్ఎల్ఎన్ రెడ్డి, ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు గడ్డం కాశీనాథ్, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల రమేష్, బీజేపీ మెదక్ పట్టణ అధ్యక్షులు నాయిని ప్రసాద్, ఓబీసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతల శేఖర్, బీజేవైఎం నిజాంపేట మండల ప్రధాన కార్యదర్శి అభిషేక్ రెడ్డి, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# గజ్వేల్‌లో మరో ప్రమాదం

## మహిళ మృతి
## మరో ముగ్గురికి గాయాలు



**గజ్వేల్, నవంబర్ 2 (ప్రజాస్వరం) :**

కారు ఢీకొని మహిళ మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయలైన సంఘటన గజ్వేల్ మండలంలోని రిమ్మనగూడ గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. గజ్వేల్ సీఐ సైదా కథనం ప్రకారం సికింద్రాబాద్‌కి చెందిన మహమ్మద్ రాజా అతని కొడుకు ఖుజిమ్, కోడలు సకినాల్‌లు రాజా కారులో కుటుంబ సభ్యులతో జనగామ నుండి సికింద్రాబాద్ వస్తూ మార్గమధ్యలో గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ శివారులో గల ఎస్ 4 హోటల్ వద్ద భోజనం చేశారు. హైదరాబాద్ వైపు వచ్చేందుకు రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుండి హైదరాబాదు వైపు వస్తున్న మెదక్ డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు మహమ్మద్ రాజా కారును ఢీ కొట్టింది. దీంతో సికింద్రాబాద్‌కి చెందిన మహమ్మద్ జమీలకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమెకు వైద్యం అందించేదుకు పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆమె భర్త మహమ్మద్ రాజా, కొడుకు, కోడలుకు తీవ్రగాయలు కావడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్ కిమ్స్‌కి ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.




# కులగణన నుండి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి

**మెదక్, నవంబర్ 02 (ప్రజా స్వరం) :**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా కేంద్రం తపస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎల్లం, చల్లా లక్ష్మణ్‌లు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల గణన నుండి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని అన్నారు. ప్రాథమిక పాఠశాలకు వచ్చే విద్యార్థులను హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు తీసుకొని వస్తారని, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను వదిలిపెడితే వారు ఏక్కడికి వెళ్తారని వారు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం సర్వే చేయించాలనుకుంటే అత్యవసర విభాగాలు మినహాయించి మిగిలిన అన్ని విభాగాల ఉద్యోగుల చేత పని చేయించి, రెండు రోజుల లో సర్వే చేయించవచ్చని వారన్నారు. గతంలో ఒకే రోజు సమగ్ర కుటుంబ సర్వే చేసిన సంగతి తెలిసిందే అని వారన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సంతోష్, కృష్ణ, నరేందర్ పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎంపీ రఘునందన్ విరాళం



**దౌల్తాబాద్, నవంబర్ 2 (ప్రజాస్వరం) :**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయం నిర్మాణం కోసం మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు రూపాయలు. లక్ష నగదు విరాళం ఇచ్చినట్లు దౌల్తాబాద్ బీజేపీ మండల అధ్యక్షులు భూపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం ఎంపీ రఘునందన్‌రావు నివాసంలో లక్ష రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయాల నిర్మాణంతో ఆధ్యాత్మికత భావన పెంపొందుతుందని నూతన హనుమాన్ దేవాలయానికి తన వంతు సహకారంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు లక్ష రూపాయలు అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. అందరి సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టి అంగరంగ వైభవంగా ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ప్రజలందరూ ఆంజనేయస్వామి ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో పాడి పంటలతో ఆనందంగా ఉండాలని స్వామి ఆశీర్వాదం ఎల్లప్పుడూ దౌల్తాబాద్ మండల ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ శివరాములు, సత్యానారాయణగౌడ్, శివ, రాములు, మహేష్, స్వామి, నరసింహారెడ్డి, స్వామిగౌడ్, లక్ష్మీ ఆగ్రో రైతు సేవా కేంద్రం యజమాని లాలు, బాబు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో నిఘా నేత్రాలు కీలకం

## తొగుట సీఐ షేక్ లతీఫ్

**దౌల్తాబాద్, నవంబర్ 2 (ప్రజాస్వరం) :**

గ్రామాల్లో దేవాలయాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలు నియంత్రించవచ్చని, నిందితులను త్వరగా పట్టుకునే అవకాశం ఉంటుందని తొగుట సీఐ షేక్ లతీఫ్ అన్నారు. శనివారం రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో రేణుకా మాత ఎల్లమ్మ ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతకొద్ది రోజుల నుంచి సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాలలో దొంగతనాలు జరుగుతున్నాయని, ఆ దేవాలయాల్లో, గ్రామాల్లో సీసీకెమెరాలు లేకపోవడంతో నిందితులను పట్టుకోవడం కష్టమవుతుందన్నారు. గ్రామాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాయపోల్ ఎస్ఐ రఘుపతి సీసీకెమెరాల ప్రాధాన్యత, నేరాల నియంత్రణ గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా అనాజీపూర్ గౌడ సంఘం వారు ముందుకొచ్చి ఎల్లమ్మ దేవాలయంలో ఆరు సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రధాన కూడలిలలో, ఆలయాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని గ్రామాల్లో కెమెరాలు ఉన్నప్పటికీ అవి సరిగ్గా పనిచేయడం లేదని వాటికి మరమ్మతులు చేపట్టి వాడుకలోకి తీసుకురావాలన్నారు. శాంతి భద్రతలు కాపాడటంలో నేరాలు నియంత్రించడంలో ప్రజలు పోలీస్ శాఖ వారికి సహకరించాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, యువత గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. కార్యక్రమంలో రాయపోల్ ఎస్ఐ విక్కుర్తి రఘుపతి, అనాజీపూర్ గౌడ సంఘం అధ్యక్షులు రాయపోల్ హరికృష్ణ గౌడ్, ఉపాధ్యక్షులు అన్నెబోయిన నర్సింహులుగౌడ్, డైరెక్టర్లు యాదగిరి గౌడ్, బాల్‌రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సంఘ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడిగా మల్లారెడ్డి

**మేడ్చల్, నవంబర్ 2 (ప్రజాస్వరం) :**

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామంలో హరిహర నందన అయ్యప్ప స్వామి దేవాలయంలో జాతీయ అధ్యక్షులు శ్రీఅయ్యప్పదాస్, జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలరావు, తెలుగు రాష్ట్రాల కన్వీనర్ రాచర్ల రమేష్, జాతీయ కార్యదర్శి రాజేష్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి సిద్ధు ఆధ్వర్యంలో రొండ మల్లారెడ్డి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గురవయ్య, రాష్ట్ర జోనల్ కార్యదర్శి మల్లేష్, జిల్లా అధ్యక్షులు సాయిలు, కార్యదర్శి మధు, కోశాధికారి నరసింహ, మేడ్చల్ జిల్లా పీఆర్వో సురేశ్, ఈసీ మెంబర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.





# పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి

## జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి




**వికారాబాద్, నవంబర్ 2(ప్రజా స్వరం):**

వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి నేతృత్వంలో జిల్లా హోంగార్డ్స్ అధికారులతో శనివారం దర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముందుగా హోంగార్డ్స్ అధికారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్స్ అధికారులు కూడా పోలీస్ కుటుంబంలో భాగమే అన్నారు. ప్రతిఒక్కరూ సమయపాలన పాటిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని, తమ పనిచేసే చోట్లలో అంకిత భావంతో పనిచేయాలనీ, పోలీస్ డిపార్ట్మెంట్‌లో పనిచేసే ప్రతి అధికారిపై స్థాయి నుండి క్రింది స్థాయి వరకు కలసికట్టుగా, సమన్వయంతో కలసి పని చేసినప్పుడే జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్‌కు మంచి పేరు వస్తుంది. ఎవరు కూడా జిల్లా పోలీస్ డిపార్ట్మెంట్‌కు చెడు పేరు వచ్చే విధంగా ప్రవర్తించవద్దనన్నారు. కార్యక్రమంలో హోంగార్డ్స్ అధికారులు తమ సమస్యలకు సమబంధించిన మెమోరాండంను జిల్లా ఎస్పీకి అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ డేవిడ్, జిల్లా హోంగార్డ్స్ ప్రసిడెంట్ సుధాకర్, తెలంగాణ రాష్ట్ర హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ చాంద్ పాషా, జిల్లాలోని హోంగార్డ్స్ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాలో 126 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**వికారాబాద్, నవంబర్ 2(ప్రజా స్వరం) :**

జిల్లా వ్యాప్తంగా 202425 సీజన్‌కు వరిని కొనుగోలు చేసేందుకు వీలుగా 126 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు. ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 1.05,000 మె ట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఒంగోలు చేసేందుకు సంకల్పించడం జరిగిందని ఆయన తెలిపారు. రైతులు పండించిన ధాన్యం గ్రేడ్ ఏ రకానికి 2320 రూపాయలు, సాధారణ రకానికి 2300 రూపాయలు అదే విధంగా సన్న రకం ధాన్యానికి అదనంగా 500 రూపాయలు చెల్లించుటకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. 126 వరి కొనుగోలు కేంద్రాలకు గాను 34 ఐకేపీ, 61 పీఏసీఎస్, 31 డీసీఎంఎస్ ఏజెన్సీల ద్వారా 108 కేంద్రాల్లో దొడ్డు రకం వరి ధాన్యం, 18 కేంద్రాల్లో సన్న రకం వరి కొనుగోలు చేసేందుకు నిర్ణయించామన్నారు. రైతులు ఎండబెట్టిన, చెత్త, తేమ లేకుండా ధాన్యము కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని ఆయన సూచించారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**వికారాబాద్, నవంబర్ 2 (ప్రజా స్వరం) :**

జిల్లాలో నవంబర్ 4 నుండి తప్పనిసరిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వరి ధాన్య సేకరణ, సీఎంఆర్‌పై తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్, ఉన్నత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఖరీఫ్ సీజన్ సంబంధించిన ధాన్యం సేకరణకు రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాలు ఏర్పాటు చేసి దొడ్డు, సన్న బియ్యం రకాలను వేరువేరుగా సేకరించాలని అధికారులకు సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ నవంబర్ 4వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రణాళిక బద్ధంగా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మౌలిక సదుపాయాల కల్పనతో పాటు తాగునీరు, టెంట్లు, గోనె సంచులు, టార్పాలిన్ షీట్‌లను సమకూర్చుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతాన్ని గుర్తించే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని, దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని వేరువేరుగా సేకరించి మార్గదర్శకాలకు అనుగుణంగా గుర్తులను సూచించాలని ఆయన తెలిపారు.

# కుటుంబ సర్వే పరిశీలన

**కీసర, నవంబర్ 2 (ప్రజా స్వరం) :**

నాగారం మున్సిపల్ పరిధిలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఎన్యుమరేటర్లు డోర్ టు డోర్ చేస్తున్న సర్వేను శనివారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఎన్యుమరేటర్లలతో మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే జరిగేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# కులగణన అభివృద్ధికి దోహదం

**వికారాబాద్, నవంబర్ 2(ప్రజా స్వరం) :**

వికారాబాద్ జిల్లాలో శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి శనివారం పర్యటించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి బీసీ కులగణన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పార్టీ విస్తృతస్థాయి అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఉదయపూర్ డిక్లరేషన్ తరువాత దేశంలోనే తొలి సారిగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సాగుతున్న కులగణన అణగారిన, వెనుకబడ్డ వర్గాల అభివృద్ధికి, స్థానిక ఎన్నికల్లో బలహీన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం అందించేందుకు దోహదపడుతుందన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక



# కొనుగోలు కేంద్రాలు సరే.. కొనుగోళ్లేవి..?

## దసరా పోయింది.. దీపావళి పోయింది అయినా కొలిక్కిరాని ధాన్యం కొనుగోళ్లు

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాశులను పోసి ఎదురుచూస్తున్న రైతులు



**చిన్న శంకరంపేట, నవంబర్2 (ప్రజాస్వరం) :**

దసరా పోయి.. దీపావళి వచ్చినా ధాన్యం కొనుగోళ్లు కొలిక్కి రాలేదు. ప్రభుత్వం ఆర్భాటంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ.. ఉమ్మడి మండలంలో ఎక్కడ కూడా ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటని 24 గంటల్లో ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్ పార్టీ చిన్న శంకరంపేట మండల అధ్యక్షులు రాజు హెచ్చరించారు. చిన్న శంకరంపేట మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని బీఆర్ఎస్ చిన్న శంకరం మండల అధ్యక్షుడు పట్లూరి రాజు పరిశీలించారు. మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మకానికి తీసుకువచ్చిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్మకానికి కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావడంతో కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేయకపోవడంతో అక్కడే ఆరబెట్టిన ధాన్యం రైతులకు అకాల వర్షం కంటనీరు పెట్టిందని ఆవేదన చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభోత్సవం చేయడం తప్ప ఎక్కడ కూడా ఉమ్మడి మండలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు పండించిన పంట కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలని చెప్పిన ప్రభుత్వం నేడు ధాన్యాన్ని కొనుగోలు చేయలేకపోవడంతో పాటు కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే రైతులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులు పండించిన ప్రతి చివరి గింజను ఎలాంటి షరతులు లేకుండా తడిసిన మొలకెత్తిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రాజు, గొండా స్వామి, బాగారెడ్డి, అజయ్‌గౌడ్, వెంకట్‌గౌడ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.






# బీఆర్ఎస్‌ను ఖతం చేస్తాం..

## మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

**మెదక్, నవంబర్ 02 (ప్రజా స్వరం) :**

రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీని ఖతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రం ద్వారక గార్డెన్స్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో కుల గణనపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేస్తుందన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ బీసీలకు ప్రాధాన్యత ఇస్తారు. రానున్న రోజుల్లో బీసీలకు రిజర్వేషన్స్ శాతం పెరగనున్నట్లు తెలిపారు. బీసీలు ఐక్యంగా ఉండాలని కులాల వారీగా విడిపోవద్దని, అలా జరిగితే బీసీల ఎదుగుదల కుంటుపడే అవకాశం ఉందన్నారు. బీసీలు ఐక్యతతో ఉంటేనే బీసీలకు అన్ని అవకాశాలు దక్కనున్నాయన్నారు. తను ఎమ్మెల్యేగా ఉన్న లేకున్నా మెదక్ నియోజకవర్గంలో ఎన్నో గ్రామాల్లో సొంతగా బోర్లను వేయడం జరిగిందనీ, ఇప్పటికీ వాటిని గ్రామాల్లో వాడుతున్నారని గుర్తుచేశారు. తను అధికారంలో లేకున్నా కూడా గ్రామాల్లో సర్పంచ్‌లను, ఎంపీపీలను, జెడ్పీటీసీలను గెలిపించుకున్నానన్నారు. రాష్ట్రాల విభజన జరిగింది రాజకీయ లబ్ధికోసం మాత్రమే తప్ప అభివృద్ధి కోసం కాదన్నారు. గత ప్రభుత్వం ఏ గ్రామంలో కూడా పూర్తి స్థాయిలో సంక్షేమ పథకాలను ఇవ్వలేదని, కాంగ్రెస్ పార్టీ పథకాలు ఆలోచన అందరికీ సంక్షేమ పథకాలు అందించే విధంగా పద్ధతి ప్రకారం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు ఇప్పటి వరకు అందరికీ అందలేదని, ఇందిరమ్మ ఇళ్లు ప్రతి ఒక్క ఇల్లు లేని వారికి అందిస్తామన్నారు. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ప్రధానమంత్రి అయ్యే అవకాశాలు ఉన్నా కాలేదన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో పనిచేస్తుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీనీ బీసీలు కాపాడితే అప్పుడు బీసీలకు పార్టీ కాపాడుకుని అవకాశాలు ఇస్తుందన్నారు. మైనంపల్లి హన్మంతరావు బ్రతికి ఉన్నన్ని రోజులు బీఆర్ఎస్‌ను పండపెట్టే వరకు ఊరుకొనన్నారు. రాష్ట్రంలో మీరు మళ్ళీ అధికారంలోకి వచ్చేది లేదన్నారు.

# నేడు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం

**శామీర్‌పేట విద్యుత్ ఏఈ రాఘవేందర్‌రావు**

**శామీర్‌పేట, నవంబర్ 2 (ప్రజా స్వరం) :**

విద్యుత్ వినియోగదారుల దినోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు శామీర్‌పేట విద్యుత్ ఏఈ రాఘవేందర్‌రావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం పురస్కరించుకొని విద్యుత్ సమస్యలపై సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావొచ్చన్నారు. విద్యుత్ బిల్లులు ఎక్కువ, తక్కువ వస్తున్న, అధికంగా వస్తున్న సదస్సులో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. అలాగే ఎలాంటి విద్యుత్ సమస్యలైన వాటి పరిష్కారానికి ఈ సదస్సులో అధికారులకు తెలియజేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

# విద్యార్థులు వృత్తి నైపుణ్యత సాధించాలి

**- ప్రిన్సిపాల్ శశిధర్**

**చిన్నశంకరంపేట, నవంబర్ 2 (ప్రజాస్వరం) :**

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులు జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా చిన్న శంకరంపేట మండల కేంద్రంలోని అజయ్‌కుమార్ సోలార్ పవర్‌ప్లాంట్‌ను సందర్శించి పవర్ ఉత్పత్తి ఏ విధంగా జరుగుతుందో ప్రత్యక్షంగా విద్యార్థులు తెలుసుకున్నారు. జాబ్‌ట్రైనింగ్ రెండు నెలల పాటు ఉంటుందని, ఈ ట్రైనింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శశిధర్ విద్యార్థులకు సూచించారు. ఇందులో ఏటీ, ఓఏ, సీఎస్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నవంబర్, డిసెంబర్ రెండు నెలలు కొనసాగుతుందన్నారు. ఇది వారికి ఎంతో నైపుణ్యం పొందడానికి ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వొకేషనల్ అధ్యాపకులు లక్ష్మీపతి, శ్రీవాణి, విక్రమ్, తిరుపతి, ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల పక్షాన నిలబడేది ఎర్రజెండానే

## సీపీఎం(ఐ) రాష్ట్ర కార్యదర్శి చుక్కా రాములు

**తూప్రాన్, నవంబర్ 2, ప్రజాస్వరం :**




తెలంగాణ రాష్ట్రంలో కార్మికులకు అండగా నిలిచేది ఎర్ర జెండానే అని సీపీఎం(ఐ) రాష్ట్ర కార్యదర్శి చుక్కారాములు అన్నారు. శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో నిర్వహించిన సీపీఎం(ఐ) పార్టీ 15వ జిల్లా మహాసభకు ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూప్రాన్‌లో మొట్ట మొదటిసారిగా నిర్వహిస్తున్న సీపీఐ(ఎం) 15వ జిల్లా మహాసభలో భాగంగా నలుమూలల నుండి వచ్చి కార్మికులు భారీ ఎత్తున హాజరయ్యారన్నారు. భారతదేశానికి సమీప దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా నాయకులే శ్రీలంక దేశానికి అధ్యక్షులయ్యారన్నారు. శ్రీలంక ప్రజలు ఎర్రజెండా ప్రాధాన్యత తెలుసుకున్నారన్నారు. అనేక దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు ఎర్ర జెండాలకు మద్దతిస్తున్నారని తెలిపారు. భారత దేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకుండా, ప్రజల నుండి తప్పించుకోవడానికి మతం పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారనీ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు మతం ఆధారంగా ఓట్లు అడిగే పద్ధతి చాలా దుర్మార్గమని విమర్శించారు. మన దేశంలోని సామాన్య ప్రజల కష్టాలు తీర్చలేని కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించాలనీ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలల గడుస్తున్నా ఆరు గ్యారెంటీల పేరుతో గారడి చేసి ప్రభుత్వంలోకి వచ్చిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను పట్టించుకోకుండా, ప్రజా సమస్యలపై పరిపాలన చేయకుండా, హైడ్రా పేరుతో హైడ్రామా చేస్తుందని ఘాటుగా విమర్శించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్రజాస్వామిక విధానంతో ప్రజాస్వామ్యాన్ని, ప్రజలను పట్టించుకోకపోవడంతో, కార్మికును పట్టించుకోకపోవడం, అంగన్వాడీలను చీల్చడం, ఆర్టీసీ యూనియన్లను రద్దు చేయడం, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయకపోవడం కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, కేసీఆర్‌ను ప్రజలు త్వరగా ఇంటికి పంపించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ప్రవేశపెట్టిన ఫ్రీ బస్ పథకం తప్ప ప్రజలకు మరేమి చేసింది లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త డ్రామాలు మొదలుపెట్టి హైడ్రా పేరుతో ప్రభుత్వ భూముల్లో బడాబాబులు కబ్జాలు చేసిన భూములను స్వాధీనపరచుకుంటామని చెప్పి, పేద ప్రజల ఇండ్లను కూలకొడుతున్నారని విమర్శించారు. మహాసభలలో కార్మికులకు సంబంధించిన అన్ని అంశాలపై చర్చించి, కార్మికుల హక్కులను సాధించే విధంగా భవిష్యత్తులో పోరాటం చేస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి చుక్కారాములు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మహేందర్‌రెడ్డి, వ్యవసాయ సంఘం రాష్ట్ర నాయకురాలు పద్మ, జిల్లా నాయకులు, సంతోష్, నాగరాజు, బాగయ్య, మల్లేష్ జిల్లా కమిటీ సభ్యులు, బాలమణి, రమేష్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.





# పేదల పక్షాన రేవంత్ సర్కార్


## కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

**దౌల్తాబాద్, నవంబర్ 2( ప్రజాస్వరం) :**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల నిధి, అనారోగ్యబారిన పడినవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తన స్వగృహంలో సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం మహమ్మద్ షాపూర్ గ్రామానికి చెందిన అబ్బగౌని ఆంజనేయులు గౌడ్ గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్యం కోసం రూ.2.5 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి అంటే పేద మధ్య తరగతి కుటుంబాల నిధి అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సీఎం సహాయనిధి చెక్కుల విషయంలో అవినీతి పాల్పడిందని విమర్శించారు. తమది ప్రజా ప్రభుత్వమని తన దృష్టికి తీసుకొచ్చిన ఎల్వోసీ కానీ, సీఎంఆర్ఎఫ్ చెక్కులు గాని ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ సహకారంతో బాధితులకు తక్షణమే అందచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్యయాదవ్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు పడాల రాములు, ఉపాధ్యక్షులు మద్దెల స్వామి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారు లాలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెరుకు విజయ్‌రెడ్డి, తొగుట మాజీ ఎంపీపీ గాంధారి నరేందర్‌రెడ్డి, లక్కిరెడ్డి నవీన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కొండల్‌రెడ్డి, బ్యాగరి రాజు, కిష్టయ్య, హర్షద్, భూపతిగౌడ్, కృష్ణ పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి స్టోరీ టెల్లింగ్ పోటీలకు అర్హిత

**మెదక్, నవంబర్ 02 (ప్రజా స్వరం) :**




కళా ఉత్సవ్ రాష్ట్ర స్థాయి స్టోరీ టెల్లింగ్ పోటీల్లో మెదక్ జిల్లా చందంపేట గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థిని హర్షిత ప్రథమ స్థానం దక్కించుకొని జాతీయ స్థాయికి ఎంపికైంది. రెండు రోజులపాటు హైదరాబాదులో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో డాన్స్ లో ఐశ్వర్య గ్రూప్, వాయిద్యాల పోటీల్లో అఖిల్ కు ప్రోత్సాహక బహుమతులు పొందారు. విద్యాశాఖ అదనపు డైరెక్టర్ రాజీవ్ మొమెంటో, నగదు అందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా కళా ఉత్సవ్ కమిటీ సభ్యులు అంజా గౌడ్ మాధవరెడ్డి వంశీ కృష్ణ, గైడ్ టీచర్లు మాధవి ప్రభు రహీం ఉన్నారు. జాతీయ స్థాయి కి ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖాధికారి రాధ కిషన్, ఏఎంవో సుదర్శన మూర్తి, మండల విద్యాధికారి పుష్పవేణి అభినందించారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం 2 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm


# సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపులు

**తనిఖీ చేసి బూటకమేనని గుర్తింపు**

**మొన్నటి వరకు విమానాలకు సైతం ...**

**ఢిల్లీ : దేశంలో వరుస బాంబు బెదిరింపు ఘటనలు కొనసాగుతున్నాయి. మొన్నటి వరకూ వందలాది విమానాలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఢిల్లీకి వెళ్తున్న ఓ రైలుకు బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది.**

శుక్రవారం సాయంత్రం సమయంలో 12565 సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు.. బిహార్‌లోని దర్భంగా నుంచి న్యూఢిల్లీకి వెళ్తోంది. ఈ క్రమంలో రైలులో బాంబు ఉందంటూ ఢిల్లీ కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వచ్చింది. దీంతో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సహా భద్రతా బలగాలు అప్రమత్తమై రైలును సాయంత్రం 7:30 గంటల సమయంలో యూపీలోని గోండా రైల్వే జంక్షన్ వద్ద ఆపివేశారు. అనంతరం రైల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులూ, పేలుడు పదార్థాలూ లభించలేదని సంబంధిత అధికారులు



తెలిపారు. బాంబు బెదిరింపు బూటకమని గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తనిఖీల అనంతరం రైలును తన గమ్యస్థానానికి వెళ్లేందుకు అనుమతించారు. ఈ ఘటనతో ప్రయాణికులు, రైల్వే అధికారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

# ప్రశ్నించినందుకు కేసులా?

**సమస్యలపై పోరాడుతున్న గొంతు నొక్కడమేనా ప్రజాపాలన?**

**కేసులు, బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదు**

**మాజీ మంత్రి హరీశ్‌రావు**



హైదరాబాద్, ప్రజాస్వరం: శ్రీనివాస్ గౌడ్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. పేదల ఇళ్లు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించినందుకు కేసులు పెట్టారా..? అని ప్రశ్నించారు. కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలు తీసుకోవడం హేయమన్నారు. ప్రజాసమస్యలపై పోరాడుతున్న వారి గొంతు నొక్కడమేనా ప్రజాపాలన?అని నిలదీశారు. అక్రమ కేసులకు, బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటామన్నారు. భారాస నేతలపై పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## బీజేపీ రాష్ట్రాలతో పోలిస్తే

# మాదే రికార్డు



**అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే ఉచిత బస్సు ప్రయాణం**

**ఏడాదిలోపే రుణమాఫీ చేశాం**

**200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం**

**ప్రధాని మోదీ విమర్శలకు సీఎం రేవంత్ కౌంటర్**

హైదరాబాద్: ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు. "అధికారంలోకి వచ్చిన 2 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల సదుపాయాన్ని అమల్లోకి తీసుకొచ్చాం. ఉచిత బస్సు ప్రయాణం వల్ల మహిళలకు రూ.3433 కోట్లు ఆదా అయింది. ఏడాది కాకముందే దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ అమలు చేశాం. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. ఇందులో భాగంగా కేవలం 25 రోజుల్లోనే రూ.18 వేల కోట్లు జమ చేశాం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు.

**ఆ రాష్ట్రాల్లో గ్యాస్ ధరలు అధికం**

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ ధరలు అధికంగా ఉన్నాయి. తెలంగాణలో రూ.500కే సిలిండర్ ఇస్తున్నాం. ఇప్పటివరకు 43 లక్షల మందికి సిలిండర్ పథకం ద్వారా లబ్ధి చేకూరింది. అధిక సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నాం. గ్రూప్స్ పరీక్షలను రెగ్యులర్‌గా నిర్వహిస్తున్నాం. 11 నెలల్లోనే 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపట్టాం. నియామకాల్లో ఏ భాజపా పాలిత రాష్ట్రంతో పోల్చినా మాదే రికార్డు. హాస్టల్ విద్యార్థుల డైట్, కాస్మోటిక్ ఛార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. మూసీ పునరుజ్జీవానికి నడుం బిగించాం. కబ్జాకు గురైన నీటి వనరులను సంరక్షిస్తున్నాం. ఫ్యూచర్ సిటీ కోసం మాస్టర్ ప్లాన్ ఖరారు చేస్తున్నాం. స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ ఏర్పాటు చేస్తున్నాం. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నాం." అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# మళ్లీ ఎమర్జెన్సీ రోజులు

**కాంగ్రెస్ ది నియంతృత్వం**

**హైదరాబాద్ లో 144 సెక్షన్**

**13 జిల్లాల్లో అధికారికం**

**మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, ప్రజాస్వరం : పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామిక తెలంగాణలో మరోసారి వెనుకటికాలంలా బూటుకాళ్ల శబ్దాలతో తెల్లవారే రోజులొచ్చాయని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతారని, పోరాడితే సస్పెన్షన్లు చేస్తారని మండిపడ్డారు. ఇది నియంతృత్వ రాజ్యమని, ప్రభుత్వం నిర్బంధాన్ని నిర్మిస్తున్నదని చెప్పారు.



**ఆగ్రహం**

పోరాటం తెలంగాణకు కొత్తకాదని, ఈ మట్టి పొత్తిళ్లలోనే పోరాటం ఉన్నదని తెలిపారు. ఆ సహజత్వాన్ని ఎత్తిపడుతూ నిర్బంధాన్ని ఎదురిస్తామని, ప్రజాస్వామిక తెలంగాణ పునరుద్ధరణకై పోరాడుతామని చెప్పారు. హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలులో ఉండగా, 13 జిల్లాల్లో అధికారికంగా, 20కిపైగా జిల్లాల్లో అనధికారికంగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తిరుమలలో కొనసాగుతున్న

# భక్తుల రద్దీ



అమరావతి : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. నిత్యకళ్యాణుడు వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కంపార్టుమెంట్లు నిండిపోయాయి. అతిథి గెస్ట్‌హౌస్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18-20 గంటల్లో స్వామివారి దర్శనం అవుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 67,785 మంది భక్తులు దర్శించుకోగా 27,753 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 2.38 కోట్లు వచ్చిందన్నారు.

## జహీరాబాద్‌లోని ప్రైవేటు స్కూల్‌లో

# బాలుడి అనుమానాస్పద మృతి

సంగారెడ్డి : జహీరాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలలో ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పాఠశాల వసతి గృహంలో బాలుడి (12) మృతదేహాన్ని గుర్తించారు. అతడి తల, పెదవులు, కనుబొమ్మలపై గాయాలున్నాయి. హాస్టల్‌లోని మంచంపై నుంచి పడి మృతి చెందాడని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనల్లో విద్యార్థి సంఘాలు కూడా పాల్గొన్నాయి.

# 6 నుంచి ఒంటిపూట బడులు

**ఆరోజు నుంచే కులగణన ప్రారంభం**

**ఆ విధుల్లో 36,559 మంది ఎస్ జీటీలు, 3414 మంది హెడ్ మాస్టర్లు**

**హైదరాబాద్, ప్రజాస్వరం: రాష్ట్రంలో ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు ఈనెల 6వ తేదీ నుండి ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. 6వ తేదీ నుండి ప్రభుత్వం సమగ్ర కులగణన ప్రారంభిస్తుండగా ఈనెల30వ తేదీ వరకు కొనసాగనుంది. దీని కోసం 36వేల 559 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు, 3 వేల 414 ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్లు అదే విధంగా మరో 8వేల మంది ఇతర సిబ్బంది అవసరం కావడంతో వారిని సర్వే కోసం కేటాయించారు. ప్రతి 150 ఇండ్లకు ఒక పర్యవేక్షణాధికారి ఉంటారు. ఈ నేపథ్యంలోనే సర్వే పూర్తయ్యే వరకు ప్రైమరీ స్కూళ్లకు ఒంటిపూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.**

ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు స్కూల్ తెరిచి ఉండగా ఆ తరవాత మిగితా సమయంలో ఉపాధ్యాయులు కులగణన కోసం ఇంటింటికి వెళ్లాలి. ఇదిలా ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కులగణను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించారు. ఇచ్చిన హామీలు అన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తున్న ప్రభుత్వం ఇప్పుడు కులగణనపై ఫోకస్ పెట్టింది. పూర్తి పారదర్శంగా సర్వే చేయాలని నిర్ణయించింది. దీంతో ఈనెల 13వరకు బీసీ కమిషన్ అభిప్రాయాలను సైతం సేకరిస్తోంది.

అభిప్రాయాల సేకరణ తరవాత రిపోర్టును కూడా బహిర్గతం చేస్తామని కమిషన్ ప్రకటించింది. ఇక కులగణనలో మొత్తం 75 ప్రశ్నలను అడగనున్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, కులం, మతంతో పాటూ ఇతర ప్రశ్నలను అడుగుతారు. అదే విధంగా కులగణన కోసం ప్రత్యేకమైన కిట్లను ఉపయోగిస్తారు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఓ సభలో మాట్లాడుతూ దేశానికి తెలంగాణ కులగణన విషయంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం రోల్ మోడల్ కావాలని చెప్పారు. సామాజిక న్యాయం ప్రకారం రాష్ట్ర ఆదాయాన్ని పంచడమే తమ విధానం అని అన్నారు. దీంతో ప్రభుత్వం కులగణన విషయంలో ఎంత శ్రద్ధతో ఉందో అర్థం చేసుకోవచ్చు.

## రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో

# విషవాయువు లీక్

**30 మంది కార్మికులకు అస్వస్థత**

అమరావతి : బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలో రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో విషవాయువు లీకై 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం కంపెనీలోని పైపులైన్ నుంచి లీకేజీ ఏర్పడి విషవాయువు వెలువడింది. దీంతో అక్కడే పనిచేస్తున్న సుమారు 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతలోనయ్యారు. కార్మికులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు మండడం , కళ్లు ఎర్రగా కావడంతో వారిని నిజాంపట్నం , పిట్టవానిపాలెం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు బాపట్ల, గుంటూరు ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఒక ప్రాంతంలో మాత్రమే విషవాయువు లీకైందని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక అంచనాకు వచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విషవాయువు లీకేజీలో యాజమాన్యం నిర్లక్ష్యంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యగాని ప్రసాద్ మాట్లాడుతూ బాధితులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.


# హమాస్ పొలిటికల్ చీఫ్ హతం

**ప్రకటించిన ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్**

**లోకల్ గ్రూప్ అధికారి మాత్రమేనని స్పష్టీకరణ**

**అయ్‌మన్ అయేష్ కూడా హతం**

ఇజ్రాయెల్ : హమాస్‌ను ఇజ్రాయెల్ దెబ్బ మీద దెబ్బ కొడుతోంది. ఇప్పటికే ఆ సంస్థ చీఫ్ యహ్యా సిన్వర్‌ను మట్టుబెట్టిన ఇజ్రాయెల్ తాజాగా ఆ సంస్థ పొలిటికల్ బ్యూరో చీఫ్‌ను కూడా హతమార్చింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) ఈ విషయాన్ని ధ్రువీకరించింది. హమాస్ సీనియర్ అధికారి అయిన ఇజ్ అల్-దిన్ కసబ్‌ను వైమానిక దాడుల్లో హతమార్చినట్టు తెలిపింది. హమాస్ పొలిటికల్ బ్యూరోలో అతడు కీలకంగా ఉన్నట్టు పేర్కొంది. ఐడీఎఫ్ ఇంటెలిజెన్స్, ఇజ్రాయెల్ సెక్యూరిటీ ఏజెన్సీ సమాచారంతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్టు వివరించింది. ఇజ్రాయెల్‌పై ఉగ్ర దాడులు అమలు పరిచేందుకు అతడికి అధికారం ఉందని తెలిపింది. కసబ్ సహాయకుడు అయ్‌మన్ అయేష్ కూడా దాడుల్లో హతమైనట్టు ఐడీఎఫ్ పేర్కొంది. ఇజ్రాయెల్ చెబుతున్నట్టు అతడు హమాస్‌లో అత్యధిక ర్యాంకులో లేడని, కసబ్ స్థానిక గ్రూపు అధికారి మాత్రమేనని వివరించింది.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 2 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

## నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు

# లాంచీ ప్రయాణం




### పెద్దలకు రూ.2 వేలు

పిల్లలకు రూ.1600లు

**నాగార్జునసాగర్, ప్రజాస్వరం: పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ఎదురుచూస్తున్న నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు బోటు ప్రయాణాన్ని కార్తిక మాసం తొలిరోజు తెలంగాణ పర్యాటక శాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్రణాళికలు వేసినప్పటికీ.. సాగర్‌లో సరైన స్థాయిలో నీరు లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుతం విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదిలో.. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్ వరకు గరిష్ఠ స్థాయిలో నీటి లభ్యత ఉంది. దీంతో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ లాంచీ ప్రయాణాన్ని ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ ప్రయాణానికి మొదటి రోజు రాష్ట్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు.**

నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ఇవాళ ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది.

# నమ్మకం కలగాలి

## వర్సిటీల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం..

హైదరాబాద్, ప్రజాస్వరం : యూనివర్సిటీలపై నమ్మకం కలిగించేలా పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి వైస్ చాన్సలర్లకు దిశానిర్దేశం చేశారు. నేడు సీఎంతో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల నూతన వైస్ చాన్సలర్లు భేటీ అయ్యారు. ఈ సంధర్భంగా సీఎం వారితో మాట్లాడుతూ కొంత కాలంగా యూనివర్సిటీల పైన నమ్మకం తగ్గుతోందని అన్నారు. యూనివర్సిటీ ల గౌరవాన్ని పెంచాలని ఆదేశించారు. యూనివర్సిటీల్లో వ్యవస్థలు దెబ్బతిన్నాయని, వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలి చేయాలని సూచించారు. యూనివర్సిటీల ప్రస్తుత పరిస్థితి పైన సమగ్ర అధ్యయనం చేసి చర్యలు మొదలు పెట్టాలని చెప్పారు. అవసరమైతే కన్సల్టెన్సీ లను ఏర్పాటు చేసుకొని నివేదిక తయారు చేసుకోవాలని అన్నారు. వైస్ చాన్సలర్లకు ఎవరి ప్రభావితంతో పోస్ట్ లు ఇవ్వలేదని, మెరిట్, సామాజిక సమీకరణాల ఆధారంగానే వైస్ చాన్సలర్లను ఎంపిక చేసినట్టు స్పష్టం చేశారు. కాబట్టి ఆ బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు.



నివేదికలు సిద్ధం చేసుకోవాలి

ఎవరి ప్రభావంతో పోస్టులు ఇవ్వలేదు.. మెరిట్ ఆధారంగానే..

వైస్ చాన్సలర్లతో సీఎం రేవంత్ రెడ్డి

### వైస్ చాన్సలర్లకు పూర్తి స్వేచ్ఛ

తప్పు జరిగితే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సీఎం హెచ్చరించారు. మంచి పని చేయడానికి వైస్ చాన్సలర్ల కి స్వేచ్ఛ ఉంటుందని, ప్రభుత్వ సహకారం కూడా ఉంటుందని స్పష్టం చేశారు. యూనివర్సిటీ లను 100 శాతం ప్రక్షాళన చేయాలని, గతంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్లను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునేవాళ్లని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. యూనివర్సిటీల్లో మత్తు పదార్థాల విక్రయాల పైన దృష్టి సారించాలని చెప్పారు. అలాంటి అలవాట్లు ఉన్న విద్యార్థులను గమనించి కౌన్సెలింగ్ ఇవ్వాలని చెప్పారు.

# 5న హైదరాబాద్‌కు రాహుల్ గాంధీ

పీసీసీ సమావేశంలో పాల్గొనున్న కాంగ్రెస్ అగ్రనేత



హైదరాబాద్, ప్రజాస్వరం : నవంబరు 5న జరిగే పీసీసీ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొంటారని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే కులగణనపై రాహుల్‌గాంధీ వివరాలు తీసుకుంటారని వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు.

### ఇన్ చార్జీలుగా ఎమ్మెల్యేలు

"ప్రధాని మోదీ ఎప్పుడూ వాస్తవాలు తెలుసుకునే ప్రయత్నం చేయరు. కానీ, విమర్శలను కూడా రాహుల్‌గాంధీ పాజిటివ్‌గా తీసుకుంటారు. కులగణన కోసం కన్సెల్టింగ్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జిలుగా వెళ్తారు. కులగణన విషయంలో రాహుల్‌గాంధీ చిత్తశుద్ధితో ఉన్నారు. వంచించిన కేసీఆర్‌ను దించి ప్రజలు మాకు అధికారం కట్టబెట్టారు. సీఎం, మంత్రులు, పార్టీ నేతలు ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలు కోరుకున్న విధంగా ప్రజా పాలన అందిస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు స్వేచ్ఛగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సజావుగా నడుస్తోంది. మహేశ్వర్‌రెడ్డికి బీజేఎల్పీ నాయకుడిగా భాజపాలో దక్కుతున్న గౌరవమేంటో ఆలోచించుకోవాలి. భాజపా కార్యాలయంలో ఆయనకు కుర్చీలేదు, ఒక స్థానం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ప్రజాస్వామిక స్వేచ్ఛ ఏ ఇతర పార్టీలోనూ లేదు. భాజపాలో అంతకన్నా లేదు" అని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.

# హాస్పిటల్‌లో వ్యక్తి మృతి

## మృతుడి భార్యతో బెడ్ క్లీన్ చేయించిన సిబ్బంది

వెల్లువెత్తిన విమర్శలు



**భోపాల్: ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక వ్యక్తి మరణించాడు. అయితే అతడు చనిపోయిన బెడ్‌ను గర్భిణి అయిన భార్యతో శుభ్రం చేయించారు. దీంతో ఆ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిపై విమర్శలు వెల్లువెత్తాయి.**

మధ్యప్రదేశ్‌లోని దిండోరి జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఆదివాసీలు అధికంగా ఉండే లాల్‌పూర్ గ్రామంలో నెలకొన్న భూ వివాదంపై గురువారం ఘర్షణ జరిగింది. ఒక వ్యక్తి, అతడి ముగ్గురు కుమారులపై ప్రత్యర్థులు హాస్పిటల్‌లో వ్యక్తి మృతికాల్పులు జరిపారు. తండ్రి, ఒక కుమారుడు సంఘటనా స్థలంలోనే మరణించారు. కాల్పుల్లో గాయపడిన మరో ఇద్దరు కుమారులైన శివరాజ్, రాంరాజ్‌ను గడసరాయ్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాగా, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శివరాజ్ మరణించాడు. అయితే ఆ బెడ్‌పై రక్తం ధారగా కారింది. ఈ నేపథ్యంలో ఐదు నెలల గర్భిణీ అయిన మృతుడి భార్య రోష్నీతో ఆ బెడ్‌ను శుభ్రం చేయించారు. బెడ్‌కు అంటుకున్న రక్తాన్ని గుడ్డతో తుడిపించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆ ప్రభుత్వ ఆసుపత్రిపై విమర్శలు వెల్లువెత్తాయి.

# రాష్ట్ర పండుగగా సదర్



### ఆకట్టుకున్న గోలు 2

హర్యానాకు చెందిన ఏడడుగులకు పైగా ఎత్తు, 14 అడుగుల పొడవు, 3 వేల కిలోల బరువుతో ఉండే 'గోలు 2' అనే దున్నపోతు అందరి దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమైంది. తెలుగు రాష్ట్రాల్లోని దున్నరాజులు కూడా సదర్‌లో తమ విన్యాసాలను చూపనున్నాయి. సదర్ సమ్మేళనం దృష్ట్యా నారాయణగూడ వైఎంసీఏ కూడలిలో ఆంక్షలు విధించారు. శనివారం రాత్రి 7 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజాము 3 గంటల వరకు ఆంక్షలు కొనసాగనున్నాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని నగర పోలీసులు సూచించారు. పట్టణంలో ముషీరాబాద్‌లో నిర్వహించే 'పెద్ద సదర్' ఫేమస్. యాదవులు తమ వద్ద గల దున్నపోతుల్లో బలమైన, అందమైన దున్నపోతులను ఈ పండుగలో ప్రదర్శిస్తారు

## జీఓ జారీ చేసిన ప్రభుత్వం

ప్రతీ ఏడాది కలెక్టర్లు నిర్వహించాలని ఆదేశాలు

నేడు హైదరాబాద్ కు రానున్న దేశంలోని దున్నపోతులు

సమ్మేళనం రీత్యా నారాయణగూడ వైఎంసీఏ కూడలిలో ఆంక్షలు

హైదరాబాద్, ప్రజాస్వరం : యాదవులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. సదర్ పండుగకు రాష్ట్ర పండుగ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది రాష్ట్ర పండుగగా సదర్ సమ్మేళనాన్ని ప్రతి ఏడాది నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో యాదవులు ఘనంగా జరుపుకునే సదర్ సమ్మేళన్ ఒకటి. దీపావళి మరుసటి రోజున జరుపుకుంటారు. సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తారు. శనివారం నిర్వహించే సదర్ సమ్మేళనంలో పాల్గొనేందుకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి పేరొందిన దున్నపోతులు నగరానికి చేరకున్నాయి.

# కారులో రూ. 24 కోట్ల వజ్రాలు, నగలు

### సీజ్ చేసిన మహారాష్ట్ర ఈసీ బృందం

ముంబై: మహారాష్ట్రలో ఎన్నికల సంఘం అధికారులు ఓ కారులో ఉన్న విలువైన ఆభరణాలను సీజ్ చేశారు. ఆ కారులో వజ్రాలు, బంగారం, వెండి, ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ సుమారు 24 కోట్లు ఉంటుందన్నారు. అహల్యానగర్ జిల్లాలో ఉన్న ఓ టోల్‌బూత్ వద్ద ఎన్నికల సంఘానికి చెందిన స్టాటిక్ సర్వియలెన్స్ బృందం కారులో సోదాలు చేపట్టింది. ఆ కారులో ఉన్న సుమారు 24 కోట్ల ఖరీదైన ఆభరణాలను ఈసీ బృందం సీజ్ చేసింది. సుపా టోల్‌ప్లాజా వద్ద గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. నవంబర్ 20వ తేదీన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎస్టీ పోలీసుల్ని మోహరించారు. ఆ కారులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు. వజ్రాలు, బంగారం, సిల్వర్ జ్యులరీకి చెందిన కన్‌సైన్మెంట్ ఉన్నట్లు పోలీసులు చెప్పారు. దక్షిణ ముంబైలోని జావేరి బజార్ నుంచి ఆ వాహనం స్టార్ట్ అయినట్లు సుపా పోలీసు అధికారి అరుణ్ అవద్ తెలిపారు. ఆభరణాలకు చెందిన రశీదు చూపించాలని కోరగా, కొన్ని రశీదులను చూపించారని, కానీ ఆ రశీదుల్లో ఉన్న అమౌంట్‌లో తేడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆభరణాల గురించి ఆదాయపన్ను శాఖకు ఎస్ఎస్టీ పోలీసులు సమాచారం చేరవేశారు. ఛత్రపతి సాంబాజీనగర్, అహల్యానగర్, జల్గావ్ జిల్లాల్లో ఆ ఆభరణాలను డెలివరీ చేయాల్సి ఉందన్నారు.